

నక్షత్రవనంలో కార్తీకదీపాల వెలుగులు

కార్తీక దీపోత్సవం

రామకుప్పం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కార్తీమాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఆలయ ఆవరణతో పాటు వెనుక భాగంలో గల నక్షత్ర, రాశి, త్రిమూర్తి, నవగ్రహ వనాలు కార్తీక దీపాలతో వెలిగిపోతున్నాయి. గురువారం రాత్రి భక్తులు పెద్దసంఖ్యలో ఆలయ ఆవరణతో పాటు వనాల్లో కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు.

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు, జరిమానా



నరేంద్రరెడ్డి

చిత్తూరు లీగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో అన్నమయ్య జిల్లా యువకుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ చిత్తూరు న్యాయస్థానం తీర్పు చెప్పింది. పీటీఎం మండలం మద్దయ్యగారిపల్లెకు చెందిన నరేంద్రరెడ్డి ఓ బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు.బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో పీటీఎం పోలీసులు 2023 నవంబరు 29న కేసు నమోదు చేసి నరేంద్రరెడ్డిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు గురువారం చిత్తూరు కోర్టు ఆవరణలో ఉన్న పోక్సో కోర్టులో విచారణకు వచ్చింది.నేరం రుజువుకావడంతో పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి శంకర్‌రావు ముద్దాయి నరేంద్రరెడ్డికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 10వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. అలాగే బాధితురాలికి రూ. లక్ష నష్టపరిహారాన్ని చెల్లించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కేసును స్పెషల్ పీపీ మోహన కుమారి వాదించారు.

కఠారి దంపతుల హత్య కేసులో
నేడు తుదితీర్పు

4గంటల సేపు వాదనలు వినిపించిన చింటూ తరపు న్యాయవాది



కోర్టుకు వస్తున్న చింటూ తదితరులు

చిత్తూరు లీగల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పదేళ్ల క్రితం రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన చిత్తూరు ప్రథమ మేయర్ కఠారి అనురాధ దంపతుల హత్యకేసు విచారణ చివరి ఘట్టానికి చేరుకుంది. శుక్రవారం న్యాయమూర్తి తుది తీర్పు వెల్లడించనున్నారు. కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్ 2015 నవంబరు 17న నగరపాలక కార్యాలయంలోనే హత్యకు గురయ్యారు. ఈ సంఘటనపై చిత్తూరు ఒకటవ పట్టణ పోలీసులు చంద్రశేఖర్ అలియాస్ చింటూతో పాటు 22 మందిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.2022 నుంచి సాక్షుల విచారణ జరుగుతూ వచ్చింది.ఏ1 చంద్రశేఖర్ అలియాస్ చింటూ, ఏ2 వెంకటాచపలతి, ఏ3 జయప్రకాష్‌రెడ్డి, ఏ4 మంజునాథ్, ఏ5 వెంకటేశ్‌లపై నేరం రుజువైందని, మిగిలిన 16 మందిపై కేసు కొట్టివేస్తున్నట్లు ఈ నెల 24వ తేదీన తొమ్మిదవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరావు తీర్పు చెప్పారు. తదనంతరం నిందితుల వాంగ్మూలాలను తీసుకున్నారు. గురువారం ఈ కేసు వాయిదాకు రాగా వైద్యాధికారులు, పోలీసులు, మానసిక వైద్యులు తమ నివేదికలను సీల్డ్ కవర్లలో వేర్వేరుగా కోర్టుకు అందించారు. ఆ తరువాత న్యాయమూర్తి తన చాంబర్‌కు వెళ్లి ఆ నివేదికలను పరిశీలించారు. అనంతరం న్యాయమూర్తి కోర్టు హాలుకు రాగా చింటూ తరపు న్యాయవాది విజయచంద్రారెడ్డి మధ్యాహ్నం 3గంటలనుంచి సాయంత్రం 6.45 గంటల వరకు తన వాదనలను విన్పించారు.ఈ తరహా కేసుల్లో సుప్రీం కోర్టు, హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు పత్రాలను న్యాయమూర్తికి సమర్పిస్తూ వాదనలను విన్పించారు. అలాగే పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ కూడా వాదనలు విన్పించారు. సుదీర్ఘవాదనలు విన్న న్యాయమూర్తి కేసును శుక్రవారానికి వాయిదా వేస్తూ అదే రోజు తీర్పు వెల్లడిస్తానని చెప్పారు. గురువారమే కోర్టు తీర్పు వెల్లడిస్తుందని చింటూ, కఠారి వర్గాలకు చెందిన వారు కోర్టు వద్దకు చేరుకున్నారు. దాంతో అక్కడ కొంత ఉత్కంఠ నెలకొంది. పోలీసులు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.



కుటుంబ సభ్యులతో కోర్టు వద్ద కఠారి హేమలత

ఉపాధి కూలీల హాజరులో
అక్రమాలకు చెక్

రేపట్నుంచీ అందుబాటులోకి ఎన్ఎంఎంఎస్, ఫేస్ ఆర్‌డీ యాప్‌లు



చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల హాజరులో అక్రమాలకు చెక్ పెట్టే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఇప్పటి వరకు మాన్యువల్‌గా ఉన్న మస్టర్లు ఇకపై ఆన్‌లైన్ ద్వారా నమోదు కానున్నాయి. ఉపాధి పనులు చేసిన కూలీలు నష్టపోకుండా ఉండేలా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్)ను అమల్లోకి తేనున్నారు. దీంతో పాటు ఫేస్ ఆర్‌డీ యాప్‌ను సైతం వినియోగిస్తారు. శనివారం నుంచి అమల్లోకి రానున్న ఈ ప్రక్రియకు సంబంధించి డ్వామా అధికారులు క్షేత్రస్థాయిలో ఉపాధి కూలీల ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేశారు.

4.40 లక్షలమంది కూలీలు

జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు 2.50 లక్షల జాబ్ కార్డులుండగా, కూలీల సంఖ్య 4.30లక్షలుగా నమోదు చేశారు. కూలీలుగా నమోదైన వారికి వంద రోజుల పాటు పనులు కల్పించాల్సి ఉంది. వీరికి మస్టర్లు వేయడానికి 645 మంది ఫీల్డు అసిస్టెంట్లు, 4554 మంది మేట్‌లు ఉన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నీరు, నేల సంరక్షణలో భాగంగా చెరువులు, కుంటలు తవ్వడం, పంట కుంటలు తవ్వడం, చెరువుల నుంచి పొలాలకు నీటి కాలువలు తీయడం, రెవెన్యూ భూముల్లో కందకాలు తవ్వడం, గుట్టల్లో మొక్కలు నాటడం వంటి పనులను కూలీలకు కల్పించాల్సి ఉంది.

ఇష్టానుసారంగా మస్టర్లు

ప్రస్తుతం జిల్లాలోని 78,361 ప్రాంతాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయి.అయితే కూలీల మస్టర్‌లో భారీ అవకతవకలు చోటు చేసుకున్నాయనే ఆరోణలు చాలాకాలంగా వున్నాయి. మాన్యువల్ మస్టర్లుండడం ఫీల్డు అసిస్టెంట్లకు, మేట్‌లకు వరంగా మారింది. వీరి ఉద్యోగ భద్రత కోసం పనులకు రాకున్నా తమకు అనుకూలమైన కూలీలకు హాజరు వేసేసి లక్ష్యాలు పూర్తైనట్లు చూపడం, మస్టర్లు తప్పులతడకగా నమోదు చేయడం జరిగింది.దీని ద్వారా పలువురు కూలీలు లాభపడగా, కొందరు నష్టపోతున్నారు.వీటిని అరికట్టడానికి కొత్త మస్టర్ల (హాజరు) నమోదు విధానం నవంబరు ఒకటవ తేదీ నుంచి అమల్లోకి రానుంది. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్)ను, ఫేస్ ఆర్‌డీ యాప్‌ను సైతం హాజరు వేసేందుకు ఉపయోగించనున్నారు.కూలీలు ఉదయం 8 గంటలకల్లా ఎన్ఎంఎంఎస్‌లో హాజరు నమోదు చేయాల్సి ఉంది. ఆ తర్వాత పని చేస్తున్నాడా,లేదా అని తెలుసుకునేందుకు నాలుగు గంటలకు ఒక సారి హాజరు నమోదు చేయాలి. ఉపాధి పనులకు వచ్చిన కూలీలంతా పనిచేస్తున్నారా, లేదా అనే దానికి ఫేస్ ఆర్‌డీ యాప్‌ను వినియోగిస్తారు. పనిచేస్తున్న సమయంలో కూలీలనంతా ఒక్క చోట చేర్చి, వారిలో ర్యాండమ్‌గా ఎవరినో ఒకరిని ఫేషియల్ యాప్ ద్వారా హాజరు నమోదు చేయమంటారు. దీని ద్వారా గ్రూపులోని వారంతా పనిలో ఉన్నట్లు గుర్తిస్తారు. కొత్త హాజరు విధానం కోసం క్షేత్రస్థాయిలో ఉపాధి కూలీల ఈకేవైసీ ప్రక్రియ చేపట్టారు. 4.30 లక్షల మంది కూలీలకు డ్వామా సిబ్బంది ఈకేవైసీ పూర్తి చేశారు.



కూలీలు నష్టపోకూడదనే కొత్త విధానం

ఉపాధి హామీ పథకం కింద కూలీ పనులకు వచ్చిన వారు నష్టపోకుండా ఉండేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ఎంఎంఎస్, ఫేస్ ఆర్‌డీ యాప్‌లను అందుబాటులోకి తెచ్చాయి. ఇందుకోసం ఇప్పటికే జిల్లాలో 4.30 లక్షల మంది కూలీల ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేశాం. నవంబరు ఒకటి నుంచి కూలీలకు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ అమల్లోకి వస్తుంది.

- రవికుమార్,డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్

ఏపీఐఐసీ ఆధ్వర్యంలో 'ఇండస్ట్రీ పార్ట్నర్‌షిప్ డ్రైవ్'

చిత్తూరు సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) ఆధ్వర్యంలో గురువారం చిత్తూరు ఎస్టేట్‌లోని ఆటో నగర్‌లో 'ఇండస్ట్రీ పార్ట్నర్‌షిప్ డ్రైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. చిత్తూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ వైవీకే సుబ్బారావు, డిప్యూటీ జోనల్ మేనేజర్ భార్గవి, పరిశ్రమల శాఖ ఏడీ వెంకట రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పరిశ్రమల అభివృద్ధి, పారిశ్రామిక వాతావరణం మెరుగుదల, పెట్టుబడుల పెంపు లక్ష్యంగా ఏపీఐఐసీ తీసుకుంటున్న చర్యలపై కార్మికులకు, ప్రజలకు ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించారు. అలాగే పరిశ్రమల మౌలిక సదుపాయాల ఆధునికీకరణ, పారిశ్రామిక పార్కుల్లో రహదారులు, విద్యుత్, నీటి సదుపాయాలు, డ్రైనేజీ వ్యవస్థలు వంటి మౌలిక వసతులను ఆధునికీకరించేందుకు ఏపీఐఐసీ తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్రంలోకి కొత్త పెట్టుబడులను తీసుకురావడం, ఎంఎస్ఎంఈలకు సహకారం తదితర అంశాలపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం జిల్లావ్యాప్తంగా నవంబర్ 15వ తేది వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. అనంతరం పరిశ్రమల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు.కార్యక్రమంలో ఏపీఐఐసీ సిబ్బంది, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏపీఐఐసీ, జిల్లా పారిశ్రామిక సంస్థ అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు

పల్లె పాలనకు జవసత్వాలు

రేపటినుంచి డీఎల్డీవో స్థానే డీడీవో వ్యవస్థ ప్రారంభం

జిల్లాలో నాలుగు డీడీవో కార్యాలయాల ఏర్పాటు



చిత్తూరులో నిర్మించిన డీడీవో కార్యాలయం



డీడీవో కార్యాలయ ఛాంబర్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో డివిజినల్ అభివృద్ధి అధికారి (డీఎల్డీవో) వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైంది. ఫలితంగా పర్యవేక్షణ లేక పల్లెపాలన చాలావరకు పడకేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం పాలనాపరంగా సంస్కరణలు చేపట్టింది. గ్రామపంచాయతీల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతంగా అమలుచేసేందుకు, నిత్యం పర్యవేక్షించేందుకు 'డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీస్' (డీడీవో) ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. చిత్తూరు జిల్లాకు నాలుగు కార్యాలయాలు కేటాయించగా, చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరిలలో ఏర్పాటు చేశారు. నవంబరు 1 నుండి ఈ కార్యాలయాలు పనిచేస్తాయి. డీఎల్డీవోలకు ప్రత్యేకమైన అధికారాలు అప్పగించి డివిజన్లలో మిగిలిన అన్ని శాఖల పర్యవేక్షణ చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ప్రత్యేక డీడీవో కార్యాలయాలను ఏర్పాటు చేసింది. వీటిలో డీఎల్పీవో (డివిజనల్ పంచాయతీ అధికారి), డ్వామా, ఏపీడీ కార్యాలయాలు ఉంటాయి. చిత్తూరులోని కలెక్టరేట్ సమీపంలో, పలమనేరు, నగరి ప్రాంతాల్లో కొత్త కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. కుప్పంలో డీడీవో అధికారి నియామకం జరగనందున అక్కడ ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం డివిజన్ స్థాయిలో సేవలందిస్తున్న డీఎల్పీవో ఇకనుంచి డీడీవోలుగా వ్యవహరిస్తారు. ప్రతి డీడీవో కార్యాలయంలో పనుల నిర్వహణ కోసం సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు, ఇద్దరు అటెండర్లను సిబ్బందిగా ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్ కింద పంపించారు.

నియోజకవర్గమంతా ఒకే రెవెన్యూ డివిజనులో


● కసరత్తు చేస్తున్న ప్రభుత్వం

చిత్తూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి నియోజకవర్గమంతా ఒకే రెవెన్యూ డివిజనులో ఉండేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.ఒకే రెవెన్యూ డివిజన్ కింద ఒకటికి మించి నియోజకవర్గాలు.. ఒకే నియోజకవర్గంలోని మండలాలు కొన్ని ఒక డివిజనులో.. మరికొన్ని ఇంకో డివిజనులో వుండడంతో ఇబ్బందులు తలెత్తున్నాయి. దీంతో నియోజకవర్గం పూర్తిగా ఒకే డివిజన్ పరిధిలో ఉండేలా కూటమి ప్రభుత్వం మార్పులు తీసుకురానుంది. చిత్తూరు జిల్లాలో కూడా ఆ మేరకు మార్పులు చేర్పులు ఉండనున్నాయి.

ఏ డివిజన్లో ఏయే మండలాలు..

జిల్లాల విభజనకు ముందు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చిత్తూరు, తిరుపతి, మదనపల్లె రెవెన్యూ డివిజన్లు మాత్రమే ఉండేవి. విభజన తర్వాత చిత్తూరు పరిధిలో పలమనేరు, కుప్పం, నగరి కేంద్రాలను.. తిరుపతి ప్రాంతంలో శ్రీకాళహస్తిని రెవెన్యూ డివిజన్లుగా ఏర్పాటు చేశారు. కుప్పం డివిజన్‌లో ఆ నియోజవర్గంలోని నాలుగు మండలాలను, పలమనేరు డివిజన్‌లో అక్కడి ఐదు మండలాలతో పాటు పుంగనూరులోని నాలుగు, పూతలపట్టులోని ఓ మండలాన్ని జత చేశారు. నగరి కేంద్రంలో చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్న మూడు మండలాలతో పాటు, జీడీనెల్లూరులోని రెండు మండలాలను చేర్చారు. ఇలా.. జిల్లా చిన్నదైనా ఏకంగా నాలుగు చిన్న చిన్న రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేశారు.

వీటికి ఏ సమస్యా ఉండదు



ప్రభుత్వం అనుకున్న ప్రామాణికం మేరకు చూసుకుంటే కుప్పం, పలమనేరు, చిత్తూరు నియోజకవర్గాల్లోని మండలాలకు ఎలాంటి సమస్యా ఉండదు. ఎందుకంటే ఆయా నియోజకవర్గాల్లోని మండలాలన్నీ అక్కడ ఒకే రెవెన్యూ డివిజన్లలో ఉన్నాయి. ఉదాహరణకు కుప్పం నియోజకవర్గంలో నాలుగు మండలాలు కుప్పంలో, పలమనేరు నియోజకవర్గంలో ఐదు మండలాలు పలమనేరులో, చిత్తూరు నియోజకవర్గంలో మూడు మండలాలు చిత్తూరు డివిజన్లోనే ఉన్నాయి. కానీ, పుంగనూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు, నగరి నియోజకవర్గాలు డిస్టర్బ్ అవుతాయి.

నగరి వెళ్లినా.. నాలుగు డివిజన్‌లే..

ప్రభుత్వం తీసుకున్న ప్రామాణికాన్ని బట్టి ఇక నుంచి పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గాలు పూర్తిగా ఒకే డివిజన్లో, అంటే చిత్తూరులో ఉండనున్నాయి. నగరి మూడు మండలాలతో సహా నగరి డివిజన్ తిరుపతి జిల్లాలోకి వెళ్లిపోతుండడంతో.. నగరిలో ఐదు మండలాలూ ఒకే డివిజన్ కింద ఉంటాయి. మొత్తంగా జిల్లాలోని నగరి డివిజన్ తిరుపతిలోకి వెళ్లిపోతే, పుంగనూరు డివిజన్ కొత్తగా ఏర్పడుతుంది. అంటే మళ్లీ చిత్తూరు జిల్లాలో నాలుగు రెవెన్యూ డివిజన్లు ఉంటాయి.

ఏ నియోజకవర్గం.. ఏ డివిజన్‌లోకి..!

- ప్రస్తుతం పుంగనూరు నియోజకవర్గంలో ఆరు మండలాలుండగా.. రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలు చిత్తూరు డివిజన్లో.. మిగిలిన నాలుగు పలమనేరు డివిజన్లో ఉన్నాయి. ఇక నుంచి పుంగనూరునే రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటుచేసి ఆరు మండలాలనూ దాని పరిధిలోకి తీసుకురానున్నారు.
- పూతలపట్టు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో బంగారుపాళ్యం ఒకటే పలమనేరు డివిజన్లో ఉంది. మిగిలిన నాలుగు మండలాలు చిత్తూరు పరిధిలో ఉన్నాయి. ఇక నుంచి అన్ని మండలాలూ చిత్తూరు డివిజన్‌లోనే ఉండనున్నాయి.
- జీడీనెల్లూరు నియోజకవర్గంలో ఆరు మండలాలుండగా.. పాలసముద్రం, కార్వేటినగరం మండలాలు కొత్తగా ఏర్పడిన నగరి డివిజన్లో ఉన్నాయి. మిగిలిన నాలుగు మండలాలు చిత్తూరు డివిజన్‌నే కొనసాగుతున్నాయి.
- నగరి నియోజకవర్గంలో ఐదు మండలాల్లో నగరి, విజయపురం, నిండ్ర నగరి డివిజన్లో ఉండగా. వడమాలపేట, పుత్తూరు.. శ్రీకాళహస్తిలో ఉన్నాయి.

'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్లకు నిధుల విడుదల

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా కింద నవంబరు నెలలో సామాజిక పెన్షన్ల పంపిణీకి సంబంధించి జిల్లాకు రూ.114.46 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఆయా వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలోని సిబ్బంది పెన్షన్ పంపిణీకి నిధులను సంబంధిత బ్యాంకుల నుంచి డ్రా చేసుకోవాల్సి ఉంది. కాగా నవంబరు నెలలో జిల్లాలోని 2,68,066 మందికి సామాజిక పెన్షన్లు అందించనున్నారు.

విరిగిన ధ్వజస్తంభం


నడింపల్లెలో విరిగిన ధ్వజస్తంభం

రొంపిచెర్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం పెద్దమల్లెల పంచాయతీ నడింపల్లెలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ధ్వజస్తంభం విరిగిపోవడంతో భక్తులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం ధ్వజస్తంభానికి పూజలు నిర్వహించి క్రేన్ సాయంతో నిలబెడుతుండగా విరిగిపోయింది. అనంతరం ఆలయంలో పలు పూజలు నిర్వహించారు.

ఏరియా ఆస్పత్రి తనిఖీ


ఆస్పత్రిలో సిబ్బందికి సూచనలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి లిఖిత

పలమనేరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం, హైకోర్టుల ఆదేశాల మేరకు గురువారం పలమనేరు జూనియర్ సివిల్‌జడ్జి లిఖిత పలమనేరు ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను రోగులను అడిగి తెలుసుకొన్నారు. అలాగే పరిశుభ్రతను పాటించాలని డాక్టర్లకు, సిబ్బందికి సూచించారు. వృద్ధులు, పేద రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్. భాస్కర్, సీనియర్ న్యాయవాది అరీఫుల్లా ఖాన్, డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో హోమియోపతి విద్యార్థులు


వృద్ధులతో మెడికల్ కాలేజీ విద్యార్థులు

వెదురుకుప్పం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం వృద్ధాశ్రమానికి గురువారం పుత్తూరులోని కేకేసీ హోమియోపతిక్ మెడికల్ కాలేజీ విద్యార్థులు వచ్చారు. కాలేజీ అధ్యక్షుడు కె.కుప్పయ్యచెట్టి, ఉపాధ్యక్షుడు కె.నరసింహారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శరవణన్ ఆధ్వర్యంలో సుమారు 80 మంది విద్యార్థులు ఇక్కడికొచ్చారు. ఆశ్రమంలోని వృద్ధుల ఆరోగ్యం, జీవన విధానం తదితరాలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత వృద్ధులకు బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించారు. సూపర్ వైజర్ ప్రకాష్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన


పేయన్నపల్లెలో పంటలను పరిశీలిస్తున్న మురళీకృష్ణ

గుడిపాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటను గురువారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ పరిశీలించారు. పేయన్నపల్లెలో దెబ్బతిన్న వరి, వేరుశనగ పంటలను పరిశీలించి రైతులకు భరోసా ఇచ్చారు. కోత కోసి పొలంలో ఉన్న పన్నలు వర్షానికి తడిచి.. గింజ మొలకెత్తకుండా ఉండటానికి ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. గింజ రంగు మారకుండా ఉండటానికి లీటర్ నీటికి గ్రాము కార్బెండిజం పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయశాఖ ఏడీ ఉమా, ఏవో సంగీత తదితరులు పాల్గొన్నారు.

యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలి

డీఎల్ఎస్ఏ సెక్రటరీ భారతి



సమావేశంలో మాట్లాడుతున్న భారతి

గంగాధరనెల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ద్వారా సెల్‌ఫోన్లు, కంప్యూటర్‌ల్లోకి వివిధ రకాల యాప్‌లు వస్తున్నాయని, వాటితో అప్రమత్తంగా ఉండాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ భారతి సూచించారు. లేదంటే బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు క్షణాల్లో పోగొట్టుకుంటారని హెచ్చరించారు. గంగాధర నెల్లూరు ఎంపీడీవో ఆఫీస్‌లో గురువారం మహిళలకు, వివిధశాఖల అధికారులకు లీగల్ సర్వీస్‌లపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టెక్నాలజీ పెరగడంతో సెల్‌ఫోన్లు, కంప్యూటర్‌ల వినియోగానికి యువత అలవాటై పోయిందని చెప్పారు. వీరు తప్పుదోవ పట్టకుండా తల్లిదండ్రులు పర్యవేక్షణ ఉండాలన్నారు. క్షణికావేశంలో కేసులు పెట్టుకుని, కోర్టులు చుట్టూ తిరుగుతూ కాలంతోపాటు డబ్బు ఖర్చు పెట్టుకుని చాలామంది జీవితాలు నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ఇక దీర్ఘకాలంగా కేసులతో తిరుగుతున్నవారు రాజీ చేసుకోవడానికి లోక్‌అదాలత్‌లు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎటువంటి సమస్యలున్నా పరిష్కారం కోసం రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు టోల్‌ఫ్రీ నెంబరుకు 15100 ఫోన్‌చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఇతర వేళల్లో ఈ నెంబర్‌కు ఫోన్‌చేసి ఇబ్బంది పెట్టొద్దని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటనారాయణ, ఎంపీడీవో మనోహర్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ మహేష్‌కుమార్, ఎంఈవో ఆంజినేయులుశెట్టి, ఏఎస్ఐ మురళీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

30లోగా రెండో విడత రీసర్వే పూర్తిచేయాలి: కలెక్టర్


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న రెండో విడత రీసర్వేని వచ్చేనెల 30వ తేదీలోగా పూర్తిచేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వే అధికారులతో సమీక్షించారు. భూరికార్డుల సవరణలు, పెండింగ్‌లోని మ్యుటేషన్ సమస్యలను సకాలంలో పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సమస్యలను వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు సర్వేశాఖతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని చెప్పారు. రెండో విడత రీసర్వే కార్యక్రమం నగరి, చిత్తూరు, పలమనేరు నియోజకవర్గాలకు చెందిన 38 గ్రామాల పరిధిలో ఉన్న 40,359 ఎకరాల్లో జరుగుతున్నదని తెలిపారు. మూడో విడత రీసర్వేని 12 గ్రామాల్లోని 3859 ఎకరాల్లో చేస్తామన్నారు. డీఆర్వో మోహన్‌కుమార్, ల్యాండ్ సర్వే డీడీ జయరాజ్, ఇన్‌చార్జి ఏడీ పీఎస్ శాంతిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయానికి టెండర్లతో రూ.1.97 కోట్ల ఆదాయం


ఆస్థాన మండపంలో ఈవో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెండర్లు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి గురువారం నిర్వహించిన టెండర్ల ద్వారా రూ.1,97,65,308 ఆదాయం లభించింది. ఆలయ ఆస్థాన మండపంలో ఈవో పెంచలకిషోర్ ఆధ్వర్యంలో పలు సీల్డ్,ఆన్‌లైన్, బహిరంగ టెండర్లను నిర్వహించారు. ఈ వేలంలో పాలాభిషేకం కోసం పాలు విక్రయించు టెండర్‌ను హెచ్చు పాటదారుడు రూ.9,31,00, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కును రూ.69,00,309, నేతి దీపాలను విక్రయించే హక్కును 68,00,999 కైవసం చేసుకున్నారు. విఘ్నేశ్వర కల్యాణ మండపం వద్ద బంకు నిర్వహణ హక్కు రూ. 4,23,000, శివాలయం ఎదురుగా బంకు నిర్వహణ హక్కును రూ.9,10,000 హెచ్చు పాటదారుడు కైవసం చేసుకున్నారు. వీరందరికీ ఏడాదిపాటు హక్కు ఉంటుంది. అలాగే 2026వ సంవత్సరం క్యాలెండర్‌ను ముద్రించి విక్రయించే హక్కును హెచ్చు పాటదారుడు ఐదు నెలల కాల పరిమితితో రూ.38,00,000 కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు ప్రసాద్, రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ బాలరంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సులపై కొనసాగుతున్న తనిఖీలు

12 వాహనాల సీజ్, 65 కేసులు నమోదు



సీజ్ చేసిన ట్రావెల్స్ బస్సులు - వాహనాలను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

చిత్తూరు సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో బస్సు ప్రమాదం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖాధికారులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లా రవాణాశాఖ అధికారి నిరంజన్ రెడ్డి నేతృత్వంలో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. నిబంధనలు పాటించని వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నారు. ప్రధానంగా జిల్లా కేంద్రంలోని ఇరువారం జంక్షన్ మీదుగా బెంగళూరు, చెన్నై, తిరుపతి, విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. చిత్తూరు నుంచి బయల్దేరే ట్రావెల్స్ బస్సులనూ పరిశీలిస్తున్నారు. రెండ్రోజులుగా 65 బస్సులపై కేసులు నమోదు చేశారు. 12 బస్సులను సీజ్ చేశారు. అగ్నిమాపక పరికరాలు, ఎమర్జెన్సీ డోర్‌లు లేనివి, ప్యాసింజర్స్ లిస్ట్, పత్రాలు సరిగా లేనివి, డ్రైవింగ్ లైసెన్సు లేనివి, అనుమతి లేకుండా బస్సులో మార్పులు చేసిన బస్సులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఆర్టీవో సునీల్ కుమార్, ఎంవీఐలు రాజేశ్వర్‌రావు, నరసింహులు, మురళి, ఏఎంవీఐలు హరికృష్ణ, దీపిక తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి వాట్సాప్ గ్రూప్

● ఎస్పీ తుషార్


అమరవీరుల కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా భద్రత కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల కుటుంబాలకు పోలీసుశాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ తుషార్ తెలిపారు. గురువారం పోలీసు అతిథిగృహంలో పోలీసు అమరవీరుల కుటుంబీకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి ప్రత్యేకంగా ఒక వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేయాలని ఆదేశించారు. ఆ గ్రూప్ ద్వారా రోజూ సంబంధిత అధికారులు బెనిఫిట్స్‌పై అప్‌డేట్స్ ఇవ్వాలని సూచించారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అందజేసే ఆర్థికసాయం, ఉద్యోగావకాశాలు, తదితరాలను ఏవో నాగభూషణమ్మ వివరించారు. ఏఎస్పీలు రాజశేఖర్‌రాజు, శివానంద కిశోర్, డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌బాషా, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎల్వీఎం3-ఎం5 రిహార్సల్ విజయవంతం

సూళ్లూరుపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): షార్ నుంచి నవంబరు 2న సాయంత్రం 5.26 గంటలకు ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగం జరగనుంది. ఈ ప్రయోగానికి ముందు చేపట్టే ప్రయోగ రిహార్సల్‌ను గురువారం శాస్త్రవేత్తలు విజయవంతంగా నిర్వహించారు. రిహార్సల్‌లో భాగంగా రాకెట్‌ను మొబైల్ సర్వీసు టవర్ నుంచి వెనక్కి తీసుకొచ్చి మళ్లీ తీసుకెళ్లే కార్యక్రమాన్ని విజయవంగా చేపట్టారు. ప్రయోగానికి సంబంధించిన మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశం (ఎంఆర్ఆర్) శుక్రవారం షార్‌లో జరగనుంది. ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు సమావేశమై చర్చించి ఏవైన లోటుపాట్లు ఉంటేసరిచేసి ప్రయోగానికి సంసిద్ధత ఇస్తారు. ఎంఆర్ఆర్ అనంతరం షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ అధ్యక్షతన లాంచింగ్ ఆథరైజేషన్ బోర్డు (ల్యాబ్) సమావేశమై ప్రయోగాన్ని అధికారికంగా ప్రకటించి గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. ప్రయోగ ఏర్పాట్లు చివరి దశకు చేరుకోవడంతో షార్‌లో సందడి నెలకొంది.

3 నుంచి 9 వరకు వైద్య సిబ్బందికి సెలవులు రద్దు

● సీఆర్ఎం సెంట్రల్ టీం వస్తుండటంతో అందరూ అందుబాటులో ఉండాలి : డీఎంహెచ్‌వో


అధికారులకు సూచనలిస్తున్న సుధారాణి

చిత్తూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో నవంబరు 3 నుంచి 9వ తేదీవరకు కామన్ రివ్యూ మిషన్ (సీఆర్ఎం) సెంట్రల్ టీం జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు పరిశీలించనుంది. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి' అని డీఎంహెచ్‌వో సుధారాణి ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో అన్ని ప్రోగ్రామ్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పీహెచ్‌సీల్లో అన్ని రికార్డులను అప్‌డేట్ చేసి ఉంచాలన్నారు. ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేయించి.. వైద్య పరికరాలను, మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో నవంబరు మూడు నుంచి తొమ్మిదో తేదీవరకు వైద్యసిబ్బందికి సెలవులు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, డీఐవో హనుమంతరావు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి తిరుపతి బాలోత్సవం

తిరుపతి(ఎంఆర్‌పల్లె), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల వేదికగా నవంబరు 1, 2 తేదీలలో తిరుపతి బాలోత్సవం నిర్వహించనున్నట్లు తిరుపతి బాలోత్సవం వ్యవస్థాపకుడు మల్లారపు నాగార్జున తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లల్లో పెరుగుతున్న మానసిక ఒత్తిడిని తగ్గించి, వారిలోని సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడారు. మూడేళ్లుగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తూ ఆటవిడుపు కార్యక్రమంగా బాలోత్సవం నిలిచిందన్నారు. ఈ ఏడాది నిర్వహించే పోటీల్లో అన్ని యాజమాన్య పాఠశాలలకు చెందిన ఎల్‌కేజీ నుంచి పదవ తరగతి విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెంకాల దామోదరం, నారాయణ, పయ్యావుల గురునాథం, మణికంఠ, మునిలక్ష్మి పాల్గొన్నారు.

'ఇంటర్' పరీక్షల ఫీజు చెల్లింపునకు నేడు ఆఖరు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థుల పరీక్షల ఫీజు చెల్లింపు గడువు శుక్రవారంతో ముగియనుంది. 2026 ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యామండలి షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. దీనికి అనుగుణంగా ఫీజు చెల్లింపు గడువును సైతం ముందే ఇచ్చేసింది. ఫస్టియర్‌లో 15,098 మంది విద్యార్థులు ఉండగా, గురువారంనాటికి 14,710 మంది పరీక్ష ఫీజు చెల్లించారు. సెకండియర్‌లో 15,354 మంది ఉండగా, 13,760 మంది రెగ్యులర్, 716 మంది ప్రైవేటు విద్యార్థులు ఫీజు చెల్లించారు. ఫస్టియర్‌లో 388 మంది, సెకండియర్‌లో 878 మంది పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంది. గడువు ముగిశాక రూ.వెయ్యి అపరాధ రుసుంతో నవంబరు ఆరో తేదీవరకు ఫీజు చెల్లించే వెసులుబాటు ఉంది.

వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలతో ఎస్పీ తుషార్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినంలో భాగంగా అక్టోబరు 26వ తేదీన జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, పోలీసు అధికారులు, సిబ్బందికి నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలైన వారికి గురువారం బహుమతులను ప్రదానం చేశారు. వ్యాసరచన పోటీల్లో ఐరాలకు చెందిన కావ్యశ్రీ, జీడీ నెల్లూరుకు చెందిన హసీశ్రీ, నగరికి చెందిన దేవీశ్రీ, వక్తృత్వ పోటీల్లో ఐరాలకు చెందిన మానస, కుప్పానికి చెందిన భవ్యశ్రీ, నవ్యశ్రీ మొదటి మూడు బహుమతులు గెలుచుకున్నారు. పోలీసు విభాగంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సైబర్ సెల్‌కు చెందిన వినాయకమూర్తి, ఎస్ఆర్‌పేటకు చెందిన నాగసౌజన్య, ఐరాలకు చెందిన రాంబాబు, వక్తృత్వ పోటీల్లో కాణిపాకం పీఎస్‌కు చెందిన హరీష్, మహిళా పీఎస్‌కు చెందిన సుభాషిణి, ఎస్ఆర్‌పేట పీఎస్‌కు చెందిన నాగసౌజన్య వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. పోలీసుల పిల్లలకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కేశవరెడ్డి స్కూల్‌కు చెందిన చేతన్‌సాయి, మదనపల్లె నవోదయకు చెందిన ప్రిన్స్, చిత్తూరు చైతన్య కాలేజీకి చెందిన దయానందిని, వక్తృత్వ పోటీల్లో.. పీఈఎస్ కాలేజీకి చెందిన రోస్మిత, కేశవరెడ్డి స్కూల్‌కు చెందిన చేతనసాయి, మదనపల్లె నవోదయ స్కూల్‌కు చెందిన ప్రిన్స్‌లు వరుసగా మూడు బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు నగదు, సర్టిఫికెట్లను ఎస్పీ తుషార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీ సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

నగరి ఎమ్మెల్యే చొరవతో వంతెనకు తాత్కాలిక మరమ్మతులు


వంతెనకు పూర్తయిన తాత్కాలిక మరమ్మతులు

నగరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకుతోడు కృష్ణాపురం డ్యాం నుంచి నీరు దిగువకు విడుదలవడంతో కుశస్థలి నదిలో వరద ఉధృతి పెరిగింది. ఈ నేపథ్యంలో నగరి - కీళపట్టు మార్గంలో ఉన్న లోతట్టు వంతెన శనివారం తెగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ వెంటనే మరమ్మతులు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. గురువారం తాత్కాలిక మరమ్మతులను పూర్తి చేసి, వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్న ప్రభుత్వం

● ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూశారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని తీవ్రంగా వణికించిన తుఫాన్ తీవ్రతను అంచనా వేయడం, ప్రజలను అప్రమత్తం చేయడం, ప్రాణనష్టం, ఆస్తి నష్టం తగ్గించడం, సహాయక కార్యక్రమాలను ముమ్మరం చేయడంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలకు సీఎం సూచనలిచ్చారని ఆ ప్రకటనలో వివరించారు.

'భగవద్గీతను అవహేళన చేయడం సరికాదు'

తిరుపతి(ఉపాధ్యాయనగర్), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కోట్లాది మంది భారతీయులకు, హిందువులకు పవిత్ర గ్రంథమైన భగవద్గీతను అవహేళన చేయడం ఎంతమాత్రమూ మంచిది కాదని టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. భగవద్గీత ఎందుకూ పనికిరాదని టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు ఎంఎస్ రాజు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఆ మేరకు ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతను ఉపదేశించి నేటికి 5,125 సంవత్సరాలు అవుతోందన్నారు. ఆదర్శ జీవనశైలి, నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోవడం, ధర్మాన్ని ఏవిధంగా ముందుకు తీసుకెళ్లాలి అనే విషయాలను భగవద్గీత బోధిస్తుందన్నారు. ఇలా ఎంతో ఆదర్శవంతమైన అంశాలతో కూడిన భగవద్గీత కోట్లాది మంది హిందువుల జీవన శైలిలోఅంతర్భాగమని పేర్కొన్నారు. సునీతా విలియమ్స్ అంతరిక్షంలోకి వెళ్లే సమయంలో భగవద్గీతను, గణేష్ ప్రతిమను వెంట తీసుకెళ్లారని చెబుతూ గీత ప్రాశస్త్యాన్ని వివరించారు. అలాంటి గీత పట్ల ఎంఎస్ రాజు చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని, తక్షణం హిందువులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ర్యాపిడ్ కిట్లు వచ్చేశాయ్

● రేషన్ బియ్యం అక్రమ రవాణాకు చెక్ పెట్టే అవకాశం



తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పేదలకు చెందాల్సిన ఉచిత రేషన్ బియ్యాన్ని కొందరు పక్కదారి పట్టిస్తున్నారు. పాలిష్ చేసి మార్కెట్లో అత్యధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీనికి చెక్‌పెట్టే దిశగా ప్రభుత్వం అత్యాధునిక విధానానికి శ్రీకారం చుట్టింది. రేషన్ బియ్యం అక్రమ రవాణాను శీఘ్రమైనంత త్వరగా కట్టడిచేసేలా చర్యలు చేపట్టింది. తిరుపతి సహా పలు ప్రాంతల్లో నగరంలో రెండు నెలలకు ఒకసారి కొందరు మహిళలు వచ్చి కిలో రూ.10 నుంచి రూ 12 వంతున రేషన్ బియ్యం కొంటున్నారు. వీటిని మిల్లర్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా లక్షలాది రూపాయల పేదల బియ్యం మిల్లర్లకు చేరి పాలిష్డ్‌గా మారి.. మార్కెట్లోకి వస్తున్నాయి. అక్రమ రవాణాపై గతంలో అధికారులు తనిఖీ చేసినా.. ఆ బియ్యం రేషన్ షాపువేనని అనుమానిస్తే వాటిని ల్యాబ్‌కు పంపేవారు. పరీక్షలు చేశాకే రేషన్ బియ్యంపై నిర్ధారణకు వచ్చేవారు. ఆ తర్వాత చర్యలు తీసుకునేవారు. ఈ ప్రక్రియ ఆలస్యమయ్యేది. మరిప్పుడు వెంటనే రేషన్ బియ్యాన్ని గుర్తించేలా జిల్లాకు 30 రాపిడ్ కిట్లు పంపింది. వీటిని తిరుపతి నగరం, రూరల్, శ్రీకాళహస్తి, చంద్రగిరి, నాయుడుపేట ప్రాంతాలకు కేటాయించారు. ఈ కిట్లలో పొటాషియం థయో సైనైడ్, హైడ్రో క్లోరిక్ యాసిడ్ ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఫోర్టిఫైడ్ రైస్ అయితే.. ఈ ద్రావణాలను ఆ బియ్యంపై చల్లిన వెంటనే ఎరుపు రంగుకు మారతాయి. బయట దుకాణాల్లో విక్రయించే బియ్యమైతే రంగు మారవు. ఆ వెంటనే బియ్యాన్ని సీజ్ చేయడానికి వీలవుతుంది. ఎక్కడైనా అనుమానాలుంటే ఈ కిట్లతో పరీక్షిస్తే అది రేషన్ బియ్యమా కాదా అనేది క్షణాల్లో తేలిపోతుంది. ఇలా అక్రమ రవాణాకు చెక్ పెట్టేదిశగా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంది.

గూడూరుపల్లె పాఠశాల అభివృద్ధికి సహకారం

పుంగనూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల క్రితం చదువుకున్న జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందించడానికి గురువారం పూర్వ విద్యార్థులు ముందుకొచ్చారు. పుంగనూరు మండలం గూడూరుపల్లె హైస్కూల్‌లో 2015లో చదివిన విద్యార్థులు సమావేశమై చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదువు చెప్పిన గురువులను సన్మానించారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి, పేద విద్యార్థుల చదువును ప్రోత్సహించడానికి కృషి చేస్తామని వివరించారు. అనంతరం పాఠశాలకు పూర్వ విద్యార్థులు నీటిశుద్ధి యంత్రాన్ని వితరణగా అందించారు. గురువులు రెడ్డెన్నశెట్టి, పురుషోత్తం, షఫీ, వీరభద్రయ్య, రమేశ్, గౌస్ బాషా, పవన్, కరీమున్నీషాలను సన్మానించారు. హెచ్‌ఎం మహేష్ నారాయణ పాల్గొన్నారు.


నీటి శుద్ధి యంత్రాన్ని అందజేస్తున్న పూర్వపు విద్యార్థులు

సీపీ బ్రౌన్ సేవలు ఆదర్శనీయం

పలమనేరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సీపీ బ్రౌన్ సేవలు ఆదర్శనీయమని.. ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు ఇవ్వడం హర్షణీయమని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష కార్యదర్శులు పి.తులసినాథం నాయుడు, పుష్ప హర్షం వ్యక్తం చేశారు. విదేశీయుడు అయినప్పటికీ తన జీతాన్ని, జీవితాన్ని తెలుగుభాషా సేవకే వెచ్చించిన సీపీ బ్రౌన్ గురించి నేటి తరానికి తెలియజేయాలని తెలిపారు.

గురువులే భవిష్యత్తు నిర్మాతలు


జ్యోతీశ్వరుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సోమల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాలను నిర్మించేది గురువులేనని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు క్రి జ్యోతీశ్వరుడు పదవీ విరమణ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో జ్యోతీశ్వరుడు అందించిన సేవలు ఆదర్శనీయమని తెలిపారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు, మిత్రులు ఆయన్ను శాలువలతో సన్మానించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, ఎంఈవోలు విజయలక్ష్మి, శివరత్న, అన్నమయ్య జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు మధుసూదన్, జిల్లా కార్యదర్శి మోహన్ యాదవ్, బీటీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ మునిరత్నం, లేపాక్షి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శంకరయ్య, విశ్రాంత ఎంఈవో శ్రీరాములు, డీవీ.రమణ, హరినాథ్, హెచ్‌ఎం.హేమసుధాకర్, పీడీ కరుణానిధి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాశాలలోని సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వెంకటేశులు

పలమనేరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశులు అన్నారు. గురువారం కళాశాలలో విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల మధ్య ఎలాంటి ద్వేషాలు ఉండరాదని, సంస్కారం లేని విద్య వ్యర్థమన్నారు. దేశానికి యువత వెన్నెముక అని.. విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నందీశ్వరయ్య, ప్రోగ్రాం సమన్వయ కర్త జయశంకర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బెనర్జీ, అధ్యాపకులు శశికళ, సురేష్, కిరణ్, రాజేష్, రజని, సుధారాణి, మునీశ్వరి, రెడ్డెప్ప, జయరాములు పాల్గొన్నారు.

నేడు ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం

పుంగనూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాము గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎస్సీ, ఎస్టీల సమస్యలపై చర్చించడానికి జరిగే సమావేశానికి మండలస్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

పశువులకు ఉచిత వైద్యసేవలు


హనుమప్ప కొటాలులో పశువులకు వైద్యం చేస్తున్న వైద్యులు

కుప్పం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం హనుమప్ప కొటాలు గ్రామంలో గురువారం శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ మొబైల్ క్లినిక్‌తో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరం విజయవంతమైంది. కంపెనీకి చెందిన పశు వైద్యులు, సిబ్బంది సుమారు 30 పశువులకు వైద్యం చేశారు. ఈ సందర్భంగా శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ ఏరియా మేనేజరు నాగరాజు మాట్లాడుతూ పశువులకు వచ్చే వ్యాధులపై తాము మొబైల్ క్లినిక్‌తో ఉచిత పశు వైద్య శిబిరాలను విస్తృతంగా నిర్వహిస్తామన్నారు. అలాగే ఏ గ్రామంలో పశువులకు సమస్యలున్నా, వ్యాధులు ఉన్నట్లు అనుమానం వచ్చినా వెంటనే ఆ గ్రామానికి చేరుకుని పశువులకు ఉచితంగా వైద్యం చేస్తామని తెలిపారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీజ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ వైద్యులు సాయి కిరణ్, డాక్టర్ ప్రభావతి, డాక్టర్ కృష్ణ, ఏరియా పీఐటీ హరి, ఎఫ్ఏ అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో జనార్దన్‌రెడ్డి

బైరెడ్డిపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని.. దేశ కీర్తి ప్రతిష్ఠలు పెంపొందింపజేయడానికి కృషిచేయాలని కోరారు. వ్యాసరచన పోటీల్లో పెద్దచెల్లారగుంట జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థిని పరిణీత ప్రథమ, లక్కనపల్లె పాఠశాలకు చెందిన లోకేశ్వరి ద్వితీయ, మూలతిమ్మేపల్లెకు చెందిన సుప్రియ తృతీయ స్థానాల్లో నిలిచారు. వక్తృత్వ పోటీల్లో కమ్మనపల్లె గురుకుల పాఠశాలకు చెందిన హాసిని ప్రథమ, ఆదర్శ పాఠశాలకు చెందిన పూజ ద్వితీయ, కడపనత్తంకు చెందిన భార్గవి తృతీయ బహుమతులు సాధించారు. అలాగే క్విజ్‌పోటీల్లో పెద్దచెల్లారగుంట జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ, బైరెడ్డిపల్లె బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ, కమ్మనపల్లె ఆదర్శ పాఠశాల విద్యార్థులు తృతీయ బహుమతులు సాధించి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో-2 సుబ్రహ్మణ్యం, పాఠశాలల హెచ్‌ఎంలు మనోరంజని, దేశమ్మ, ఉపాధ్యాయులు శశికుమార్, చైతన్య, సీఆర్పీలు స్వర్ణలత, షాబుద్దీన్ పాల్గొన్నారు.









కల్యాణ మండపం ప్రారంభం


ఊరేగింపులో పూజలందుకున్న శివపార్వతులు

సోమల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో కొలువుదీరిన స్వయంభేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గురువారం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపం ప్రారంభించారు. ఆలయ ధర్మకర్తలు సోమశేఖర్, నరేంద్రబాబు కల్యాణ మండప నిర్మాణానికి సహకరించిన దాతలను సన్మానించి జ్ఞాపికలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం రాత్రి శివపార్వతుల ఉత్సవమూర్తులను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు.

1 నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు


మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

గంగవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయి గార్డెన్ సిటీలోని వినాయక స్వామి ఆలయంలో నవంబరు 1 నుంచి 3వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గురువారం కళామందిరంలో ఆలయ కమిటీ సభ్యులు సమావేశమై విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. వినాయక స్వామి దేవస్థానంలో అభయాంజనేయ స్వామి, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటటీ సభ్యులు గుణశేఖరన్, లక్ష్మీనారాయణ, మోహన్‌రెడ్డి, దేవనాధరెడ్డి, వెంకటేష్, శ్రీనివాసులురెడ్డి, శ్రీకాంత్, దేవకుమార్, ఆనందబాబు, తులసీనాథం నాయుడులతోపాటు పలువురు పాల్గొన్నారు.

సీతారాములకు అభిషేకాలు


ధాన్యాధివాసంలో స్వామి వార్ల విగ్రహాలు

సదుం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక దిగువ జాంద్రపేటలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయంలో గురువారం విశేష పూజాభికాలు నిర్వహించారు. ఉదయం జలధివాసం, ధాన్యాధివాసం, నవగ్రహ, సాయిబాబా, తారకరామ, లక్ష్మి, సుదర్శన హోమాలు, సహస్రనామ కుంకుమార్చన, సాయంత్రం గోపుర కలశ స్థాపన, విగ్రహ ప్రతిష్ఠాపన, వేదపారాయణం తదితర పూజాది కార్యక్రమాలు చేపట్టారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాస దీక్షితులు, ఆలయ వ్యవస్థాపకులు ఎద్దుల నాగభూషణం, గిరిజ కుమారి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతుల పింఛన్ల రద్దు దారుణం

పుంగనూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అలీంబాషా

పుంగనూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రత్యేక ప్రతిభావంతుల పింఛన్లు రద్దు చేయడం, వితంతు పింఛన్లు ఇవ్వకపోవడం దారుణమని మున్సిపల్ కౌన్సిలర్ రహ్మంతుల్లా (అమ్ము) ఆరోపించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అలీంబాషా అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు అజెండాలోని అంశాలను చదవడంతో కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టాలని, కౌన్సిలర్లు సూచించిన సమస్యలపై మళ్లీ ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతుల పింఛన్ల వెరిఫికేషన్ కోసం సదరం క్యాంపుల్లో పరీక్షించి చర్యలు తీసుకుంటారని... ఆ ప్రక్రియ జరిగే వరకు పింఛనుదారులందరికీ పాత పద్ధతిలోనే పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు లలిత, నాగేంద్ర, కౌన్సిలర్లు, వివిధ విభాగ అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో సమన్వయం అవసరం


సమస్యలను గ్రామస్తులతో కలిసి చర్చిస్తున్న ప్రేమ్ కుమార్ తదితరులు

కుప్పం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులతో సమన్వయం అవసరమని ఏపీఐఐసీ డైరెక్టర్ మల్లానూరు ప్రేమ్ కుమార్, మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.రాజగోపాల్ అన్నారు. కుప్పం మండలం నూలుకుంట, నడిమూరు, ఎన్.కొత్తపల్లె పంచాయతీల్లో గురువారం టీడీపీ పంచాయతీ సమన్వయ కమిటీ సమావేశాలు విస్తృతంగా జరిగాయి. కంగుంది క్లస్టర్‌లో జరిగిన సమావేశాలను ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్, వెండుగంపల్లె క్లస్టర్‌లో జరిగిన సమావేశాలను మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్‌లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ వారితో మమేకం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తూ సమన్వయంతో సమస్యల పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రామచంద్ర, నాయకులు హైదర్ వలి, శ్రీనివాసులు, కృష్ణయ్య, సంతోశ్, రమేశ్, వెడి, గాయత్రి, వసంతమ్మ, సుబ్బు, వెంకటేశ్, నాగరాజు, బాద్‌షా, బాలకృష్ణ, విజయ కుమార్, మణి, మురుగేశ్, బూత్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మానవ హక్కుల దినోత్సవం

గంగవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేలుమాయి హరిజనవాడలో శుక్రవారం మానవ హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు గంగవరం తహసీల్దార్ రేఖ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని అధికారులు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

బాధిత కుటుంబానికి అండగా కలెక్టర్

యాదమరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బుడితిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఖాదర్‌బాషా క్యాన్సర్ బారిన పడి మృతి చెందాడు. వారి కుటుంబానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ అండగా నిలిచారు. మృతుడి పిల్లల చదువు కోసం తన సొంత నిధుల నుంచి రూ.50వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు తెలుగు యువత అధికార ప్రతినిధి వల్లేరు అమర్‌నాథ నాయుడు పాల్గొన్నారు.

పౌర హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు చిట్టిబాబు

కుప్పం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పౌర హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని కుప్పం మండల తహసీల్దారు చిట్టిబాబు అన్నారు. మండలంలోని పొన్నాంగూరు ఎస్సీ కాలనీలో గురువారం తహసీల్దారు ఆధ్వర్యంలో పౌర హక్కుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పౌర హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉందన్నారు. ప్రతి ఒక్కరికీ హక్కులుంటాయని.. వాటిని ఎవరూ హరించరాదన్నారు. అలా హరించడానికి ప్రయత్నిస్తే చట్టప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు. సమావేశంలో కుప్పం ఎంపీడీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభివృద్ధికి మహిళలే కీలకం


మహిళా సమన్వయ కమిటీ సభ్యులతో రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలో టీడీపీని పటిష్ఠం చేయడానికి మహిళలే కీలమని కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్ అన్నారు. కుప్పంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం వారు పార్టీ మహిళా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి మహిళలకు పెద్దపీట వేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇకపై పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెస్కో డైరెక్టర్ ఆర్ముగం, మహిళా సమన్వయ కమిటీ సభ్యులు, తెలుగు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కుప్పిగానిపల్లెలో ఉచిత రక్తపరీక్ష శిబిరం



కుప్పిగానిపల్లెలో రక్తపరీక్ష శిబిరంలో వైద్యాధికారి, సిబ్బంది

రామకుప్పం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం కుప్పిగానిపల్లెలో గురువారం విజలాపురం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి ఆధ్వర్యంలో యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమంలో భాగంగా ఉచిత రక్తపరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 60మంది నుంచి రక్తనమూనాలు సేకరించారు. నమూనాలు రక్త నమూనాలతో 49రకాల పరీక్షలు నిర్వహించి, ఫలితాలను వారి మొబైల్‌ఫోన్లకు పంపుతారని వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు హనుమప్ప, సుబ్రహ్మణ్యం, హెల్త్‌అసిస్టెంట్ బాలు, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల ఏర్పాటు పనుల పరిశీలన


రాళ్లబూదుగూరులో విద్యుత్ లైన్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న రెస్కో ఎండీ

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం రాళ్ళబూదుగూరులో వీధి దీపాల కోసం ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్ల పనులను రెస్కో ఎండీ సోమశేఖర్ డైరెక్టరు బసవరాజుతో కలిసి పరిశీలించారు. త్వరలోనే విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు పూర్తి చేయాలని వారు స్థానిక అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెస్కో అధికారులు మునిరత్నం, వెంకటేశ్, గురుస్వామి పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాన్ని విజయవంతం చేయాలి

పలమనేరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ చేపట్టిన కోటి సంతకాల ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపునిచ్చారు. గురువారం పలమనేరులో వైసీపీ చేపట్టిన కోటి సంతకాల ఉద్యమం పోస్టర్‌ను ఆయన విడుదల చేసి అనంతరం సంతకాలు సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్పీచైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు నియోజక వర్గ వైసీపీ పరిశీలకులు వెంకటరెడ్డియాదవ్, వైసీపీ నాయకులు హేమంత్ కుమార్‌రెడ్డి, మండీ సుధా, మురళీ, మోగసాలరెడ్డెప్ప, రహీంఖాన్, రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు టీడీపీ నేత చేయూత


మట్టితో చదును చేసిన తర్వాత బాగుపడ్డ రోడ్డు

రామకుప్పం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఉన్సిగానిపల్లె పంచాయతీ జౌకుపల్లె నుంచి మరువూరు గ్రామానికి వెళ్లే రోడ్డు వర్షం వస్తే చిత్తడిచిత్తడిగా మారి గ్రామస్తులు అసౌకర్యానికి గురయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మొత్తం రొచ్చుగా మారిపోయింది. గ్రామస్తులు సంబంధిత అధికారులకు రహదారి దుస్థితిని తెలిపినా ఫలితం లేకపోయింది. సోషల్ మీడియాలో దీనిపై వార్తలు రావడంతో పెద్దగానూరుకు చెందిన టీడీపీ నేత మహేంద్రనాయుడు స్పందించారు. తన సొంత నిధులతో రహదారిపై మట్టి తోలి చదును చేయించారు. తమ గ్రామానికి వెళ్లే రోడ్డును బాగుపరిచిన మహేంద్రనాయుడుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సహకారంతో రేకులషెడ్డు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో కేశవరెడ్డి

చౌడేపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల సహకారంతో రూ. 2.25లక్షలతో రేకుల షెడ్డు నిర్మించినట్లు ఎంఈవో కేశవరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కాగతి పంచాయతీ మర్రిమాకులపల్లె హైస్కూల్‌లో 2003-04 విద్యా సంవత్సరం పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అదే గ్రామంలోని ఎంపీపీ స్కూల్ లో విద్యార్థుల సౌకర్యం కోసం రూ.2.25 లక్షల వ్యయంతో రేకులషెడ్డు నిర్మించి విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. రేకుల షెడ్‌ను ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నారదమునినాయుడు, మురళీధర్, పూర్వపు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొలింపల్లెలో చెత్తడబ్బాలకు నిప్పు


కొలింపల్లె క్రాస్ వద్ద చెత్తతో పాటు పడేసిన చెత్తడబ్బాలు

చౌడేపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కొలింపల్లె రోడ్డు పక్కనే చెత్తాచెదారం నిండి పారిశుధ్య లోపంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం రోడ్డు పక్కనే ఉన్న చెత్తలో ప్రభుత్వం అందించిన పెద్ద చెత్తడబ్బాలను పడేసి కొందరు నిప్పు పెట్టారు. మండలంలోని కొలింపల్లె క్రాస్ వద్ద చెత్తాచెదారం వేయడంతో దుర్గంధం వెదజల్లుతోందని తుందని గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. విసిగిపోయిన గ్రామస్తులు, తడి చెత్త, పొడిచెత్త సేకరణ కోసం పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసి పెద్ద పెద్ద డబ్బాలను రోడ్డు పక్కన డంపింగ్ యార్డును తలపిస్తున్న చెత్తలో పడేసి నిప్పు పెట్టారు. ఇకనైనా అధికారులు స్పందించి పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తాగునీరు కలుషితం


మురుగునీటి కాలువలో తాగునీటి బోరు

చౌడేపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మురుగునీటి కాలువలో తాగునీటి బోరు ఉండటంతో తాగునీరు కలుషితమవుతున్నాయి. మండలంలోని వెంగళపల్లె పంచాయతీ లోని గజ్జలవారిపల్లెలో గ్రామానికి తాగునీరు సరఫరా చేస్తున్న తాగునీటి బోరును మురుగునీటి కాలువ సమీపంలోనే వేశారు. అయితే బోరు కాలువలో ఉండటంతో నీరు కలుషితం అవుతుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన



రొంపిచెర్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాల, కస్తూర్బాలో విద్యార్థులకు ఎన్నికల్లో అనుసరించాల్సి విధి విధానాలపై ఉపాధ్యాయులు పిల్లలచే క్లబ్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఎన్నికల్లో విద్యార్థులు ఎన్నికల అధికారు లుగా, ఓటర్లుగా, కౌంటింగ్ అధికారులుగా పాత్రలు పోషించి ఎన్నికల సరళిని నిర్వహించి అవగాహన కల్పించారు. 6, 7, 8 తరగతుల విద్యార్థులు ఎన్నికల్లో పోటీ చేశారు. 130 మంది విద్యార్థులు ఓటింగ్‌లో పాల్గొన్నారు.

ముందుచూపుతోనే తక్కువ నష్టంతో బయటపడ్డాం

● ఎంపీ సీఎం రమేష్


జీటెక్ రవి, సీఎం రమేష్

తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందుచూపుతో మొంథా తుఫాను నుంచి చాలా తక్కువ నష్టంతో బయటపడ్డామని ఎంపీ సీఎం రమేష్ అన్నారు. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, కుటుంబ సభ్యులతో కలిసి ఆయన గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఎక్కడికక్కడ అధికారులను అప్రమత్తం చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారన్నారు. అంతకు ముందు ఆయన శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

'అఖండ2' మ్యూజిక్ కొంత పూర్తయింది



● డ్రమ్స్ శివమణి

తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ 'అఖండ2' సినిమాకు సంబంధించి బ్యాగ్రౌండ్ మ్యూజిక్ కొంతమేరకు పూర్తయిందని డ్రమ్స్ కళాకారుడు శివమణి తెలిపారు. గురువారం శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఈ సినిమాలో తనకు అవకాశం కల్పించిన సంగీత దర్శకుడు తమన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తిరుమలలో మంచి దర్శనాలు చేయిస్తున్న సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 64,048

తలనీలాలు సమర్పించినవారు: 19,838





కదిలొచ్చిన పూలవనం

తొమ్మిది టన్నుల పుష్పాలతో అభిషేకం



చామంతి, సంపంగి, రోజాలు, గన్నేరు, మల్లె, మొల్లలు, కనకాంబరం, తామర, మాను సంపంగి, కలువ, మనోరంజితం, పారిజాతం, వృక్షి, సెంటుజాజి, మొగలి రేకులు, నిత్య మల్లె.. ఇలా 16 రకాల పూలు, ఐదు రకాల పత్రాలు.. శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీనివాసుడి సేవలో తరించాయి. పుష్పయాగం సందర్భంగా గురువారం తిరుమల ఆలయంలో ఉత్సవమూర్తుల హృదయాల దాకా పూలు నిండిపోయాయి. ఉదయమే ఆలయానికి పూలబుట్టలు బారులు తీరాయి. పుష్పవనమే తరలి వస్తున్నట్టుగా ఆ దృశ్యం కనిపించింది. తమిళనాడు నుంచి ఐదు టన్నులు, కర్ణాటక నుంచి రెండు టన్నులు, ఏపీ నుంచి రెండు టన్నుల చొప్పున మొత్తం 9 టన్నుల పూలను పుష్పాభిషేకం కోసం తెప్పించారు. తులసి, మరువం, దవణం, బల్వం, పన్నీరు, కదిరిపచ్చలనూ పుష్పయాగంలో అర్చనకు వినియోగించారు. బ్రహ్మోత్సవాల సమయంలో తెలియక జరిగే దోషాల నివారణకు కార్తీకమాసంలో వచ్చే శ్రీవారి జన్మనక్షత్రమైన శ్రణానక్షత్రంలో పుష్పయాగాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అంతకుముపు స్నపన తిరుమంజనం జరిగింది. కాగా, ఈ పూలను దాతల ద్వారా సమకూర్చడంలో విశేష కృషి చేసిన గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులను ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం శాలువాతో సత్కరించారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి







ఆర్టీసీలో 705మంది ఉద్యోగులకు పదోన్నతి

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆరేళ్లుగా ఎదురు చూస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల కలనెరవేరిసంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 705 మందికి పదోన్నతి లభించింది. పదోన్నతులు పొందిన వారి జాబితా శుక్ర లేదా శని వారాల్లో డీపీటీవో జగదీష్ ప్రకటించనున్నారు. 281 మంది గ్రేడ్-1 డ్రైవర్లుగా,130మంది గ్రేడ్-1 కండక్టర్లుగా,111మంది ఏడీసీ టెక్నికల్ కంట్రోలర్‌గా,46 మంది డీసీలుగా,28మంది ఎల్‌హెచ్‌లుగా,45మంది గ్రేడ్ 1 మెకానికల్‌గా,6 మంది గ్రేడ్ 1టిమ్మర్లుగా,8మంది గ్రేడ్ 1పెయింటర్లుగా,4మంది గ్రేడ్ 1 వెల్డర్లుగా,6మంది గ్రేడ్ 1బ్లాక్‌స్మిత్‌గా,8మంది హమ్మర్‌మెన్స్‌గా.32మంది డిప్యూటీ మెకానికల్స్‌గా పదోన్నతి పొందినట్లు సమాచారం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 15 డిపోల్లో దాదాపు 6వేలమంది పనిచేస్తున్నారు. వీరిలో ఒకేసారి 705మందికి పదోన్నతి లభించడంపై ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వ విధానాలతో దాదాపు వంద మంది పదోన్నతి పొందకుండానే రిటైరయ్యారని ఈ సందర్భంగా ఉద్యోగులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రమోషన్ పొందిన వారికి మరోచోట పోస్టింగ్ ఇచ్చే అవకాశముంది. దీంతో కొన్ని ఖాళీలు ఏర్పడతాయని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి.

9దాకా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు

తిరుపతి(విద్య), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్ ప్రవేశాలకు నిర్వహించే జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షకు నవంబర్ 9వ తేదీ వరకు గడువు పొడిగించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి 6, 9 తరగతుల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది జనవరి 18వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వయసును బట్టి 4 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న బాలబాలికలకు ఈ పరీక్షకు అర్హత ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తు విధానం, అర్హతలు, పరీక్ష విధానం గురించి పూర్తి వివరాలు తెలుసుకునేందుకు 86888 88802, 93999 76999లలో తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ - నవోదయ పోటీ పరీక్షల శిక్షణా కేంద్రాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

తిరుపతి రైల్వేస్టేషన్ పనుల్లో వేగం పెంచండి:డీఆర్ఎం

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచాలని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ మేనేజరు చంద్రశేఖర్ గుప్తా ఆదేశించారు. గురువారం ఆయన తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను తనిఖీ చేశారు. దక్షిణం వైపు నిర్మిస్తున్న భవనంలో రన్నింగ్ స్టాఫ్, ప్రయాణికుల కోసం నిర్మించిన గదుల్లో మౌలిక వసతులను పరిశీలించారు. నిర్ణీత సమయానికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్టాల్స్ నిర్వహణ గురించి క్షేత్రస్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీఈ సూర్య నారాయణ, అధికారులు యూ.సుధాకర్, శ్రావణ్ కుమార్, మణికంఠ, మనోజ్‌కుమార్, స్టేషన్ మేనేజరు కె.చిన్నపరెడ్డి, దరూరు ప్రభాకర్, మాధవరావు, ఐపీఎఫ్ సందీప్‌కుమార్ ఆయన వెంట ఉన్నారు. అనంతరం రేణిగుంట రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు.

నూతన కమిటీతో వేదపారాయణదారుల నియామకాలు

తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): టీటీడీ వేదపారాయణదారుల పోస్టుల భర్తీకి నవంబరు 10వ తేదీన ఇంటర్వ్యూలు జరగనున్నాయి. ఈమేరకు ముగ్గురు సభ్యులతో కూడిన నూతన కమిటీ ఈ ఇంటర్వ్యూలను నిర్వహించనుంది. దాదాపు 700 మంది వేదపారాయణదారుల పోస్టుల భర్తీకి గతంలో టీటీడీ అంగీకారం తెలిపిన నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర బ్రాహ్మణులకు నష్టం కలిగేలా, తమిళనాడువాసులకు లబ్ధిచేకూరేలా వ్యవహరించారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ ఇంటర్వ్యూలు జరగకుండా టీటీడీ బోర్డు, అధికారులు నిర్ణయం తీసుకోవడంతో గత నెలలో భర్తీ ప్రక్రియ నిలిచిపోయింది. పాత కమిటీలోని వారిని తొలగించిన టీటీడీ.. తాజాగా మరో ముగ్గురు సభ్యులను నియమించి పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహించాలని ఆదేశించింది. ఇప్పటికే ఫైనల్ చేసిన దరఖాస్తుదారులకు కాల్‌లెటర్లు పంపారు. దరఖాస్తుల స్వీకరణ సమయంలోనే రాష్ట్ర బ్రాహ్మణులను తొలగించారని, గత అధికారులు ఎంపిక చేసిన తమిళనాడువాసుల దరఖాస్తులను స్వీకరించి నూతన కమిటీతో ఇంటర్వ్యూలు చేయించినా రాష్ట్ర బ్రాహ్మణులకు న్యాయం జరగదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై టీటీడీ అధికారికంగా ప్రకటన చేయాల్సి ఉంది.

తిరుమల తర్వాత కాణిపాకం రండి :ఎమ్మెల్యే మురళి

తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులందరూ కాణిపాక వినాయకస్వామి ఆలయాన్ని కూడా దర్శించాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ విజ్ఞప్తి చేశారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడుతూ, కాణిపాకంలో వసతి సముదాయం, కల్యాణవేదికల నిర్మాణం కోసం రూ.25 కోట్లు కేటాయించిన టీటీడీ చైర్మన్, సభ్యులు, ఈవో, అదనపు ఈవోలకు ధన్యవాదాలు తెలిపారు.

ఏడేళ్లుగా పరిశ్రమల కోసం ఎదురు చూపులు



ఏపీఐఐసీ బోర్డు

● 80కి పైగా ఏర్పాటు చేస్తామన్న మంత్రి

● అమలుకు నోచుకోక నిరాశలో ప్రజలు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలత్తూరు, కొత్తపాళెం, భవానీశంకరపురంతోపాటు తొట్టంబేడు మండలం రౌతుసూరమాల గ్రామాల ప్రజలు పరిశ్రమల కోసం ఎదురు చూస్తున్నారు.


ఏపీఐఐసీకి కేటాయించిన భూమి

2017లో ఈ నాలుగు గ్రామాల నుంచి ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా 2095 ఎకరాల భూములను సేకరించింది. గత ప్రభుత్వంలో ఈ భూములకు సంబంధించిన భూపరిహారాన్ని రైతులకు చెల్లించింది. వివిధ కారణాలతో కొంత మందికి చెల్లించలేదు. ఈ భూములకు లింక్ రోడ్డు నిర్మాణాలు, నాయుడుపేట హైవేకు ఆరులేన్ల రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. భూములు శరవేగంగా తీసుకున్న అధికారులు ఇప్పటి వరకు ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాకపోవడంతో ప్రజలు నిరాశకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు నెలకొల్పడంతో ఈ ప్రాంతంలో కూడా పరిశ్రమలు నెలకొల్పతారన్న ఆశతో ఉన్నారు. గత సంవత్సరం ఆగస్టులో రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ యువరాజ్ ఏపీఐఐసీ భూములను సందర్శించి, త్వరితగతిన భూములను అభివృద్ధి చేసి పరిశ్రమలు స్థాపిస్తామని చెప్పారు. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఏపీఐఐసీ భూములను పరిశీలించారు. ఈ భూములను అభివృద్ధి చేసి, 80 పరిశ్రమల ఏర్పాటుకు కేటాయిస్తున్నామని, నెల రోజుల్లో శంకుస్థాపన చేస్తామన్నారు. భూముల్లో లింక్ రోడ్ల పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించి ఏడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు పట్టించుకున్న వారు లేరని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏపీఐఐసీ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పరిశోధనలు ప్రగతికి తోడ్పడాలి:కలెక్టర్

పాకాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తలు, రీసెర్చ్ స్కాలర్లు తమ పరిశోధనలతో దేశాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సూచించారు. విజిలెన్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం గాదంకిలోని ఎన్ఏఆర్ఎల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు పరిశోధనలకు అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. వాతావరణంపై ఇక్కడ జరుగుతున్న పరిశోదనలు అభినందనీయమన్నారు. పరిశోధనా ఫలితాలు వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగకరమన్నారు. మొంథా తుపానుకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవడానికి వాతావరణ పరిశోధన కేంద్రాలవల్లనే సాధ్యమైందని గుర్తు చేశారు. ఇలాంటి కీలక కార్యాలయ విధుల్లో అప్రమత్తత అవసరమన్నారు. ఆయన సంస్థలోని హై పెర్మార్మెన్స్ కంప్యూటింగ్ వ్యవస్థ, వాతావరణ పరిశోధన, రాడార్ విధానాలను ఆసక్తిగా పరిశీలించారు. ఎన్ఏఆర్ఎల్ డైరెక్టర్ డాక్టర్ అమిత్ కుమార్ పాత్రో, విజిలెన్స్ అధికారి రఘునాథ్, అవేరనెస్ కమిటీ చైర్మెన్ డాక్టర్ చైతన్య జైన్ ఏవో మల్లిక మాధురి, రీసెర్చ్ స్కాలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎన్ఏఆర్ఎల్ అధికారులు,శాస్త్రవేత్తలు. రీసెర్చి స్కాలర్లు,సిబ్బందితో కలెక్టర్

వైభవంగా అత్తి వరదరాజస్వామి విగ్రహ స్థాపన పూజలు




వరదరాజస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన - హోమపూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధగా కొలువైన వరదరాజస్వామి ఆలయంలో గురువారం అత్తివరదరాజస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. అగ్ని ప్రతిష్ఠాపనం, కుంభారాధనం, మహాశాంతి పూజలు చేశారు. అనంతరం విగ్రహస్థాపన జరిగింది. అనంతరం స్వామివారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించి, అలంకరించారు. ఆలయ ఆవరణంలో హోమపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం అగ్నిప్రణయనం, కుంభారాధనం, సర్వగాయత్రి హోమం జరగనుంది.

పటేల్ స్ఫూర్తితో దేశాభివృద్ధికి పాటుపడాలి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్లబాయ్ పటేల్ స్ఫూర్తిగా యువత దేశం కోసం, ఐక్యత కోసం పాటుపడాలని పలువురు వక్తలు యువతకు పిలుపునిచ్చారు. మాజీ ఉప ప్రధాని పటేల్ 150వ జయంతి సందర్భంగా తిరుపతిలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. బాలాజీ కాలనీ నుంచి కచ్చపి ఆడిటోరియం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్వీయూ, ఇతర ప్రైవేటు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కచ్చపి ఆడిటోరియంలో జరిగిన సభా కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ స్వాతంత్ర్య అనంతరం దేశం ముక్కలయ్యే పరిస్థితుల్లో పటేల్ దృఢ సంకల్పంతో 560 సంస్థానాలను ఒక్కటిగా చేసి భారత దేశంగా మలిచారని చెప్పారు. ఆయన ఆశయాలు, సంకల్పం మనందరికీ ఆచరణ కావాలని పిలుపునిచ్చారు. ఎస్వీయూ వీసీ ఆచార్య నరసింగారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు మాట్లాడుతూ పటేల్ ఆదర్శంగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. రాష్ట్రాలకు నిధుల పెంపు, నీతి ఆయోగ్, జీఎస్టీ తగ్గింపు తదితర విధానాలతో కేంద్ర ప్రభుత్వం దేశ సమగ్రతకు పాటుపడుతోందన్నారు. బీజేపీ రాష్ట్ర సంఘటనా మంత్రి మధుకర్ మాట్లాడుతూ పటేల్ జీవిత విశేషాలను, ప్రముఖ సంఘటనలను ఉదహరిస్తూ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగాసనాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, బీజేపీ నేతలు తదితరులు



తిరుపతిలో సాగుతున్న ఐక్యతా ర్యాలీ

బాధిత కుటుంబానికి అండగా కలెక్టర్


ఖాదర్‌బాషా భార్యకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

యాదమరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బుడితిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఖాదర్‌బాషా క్యాన్సర్ బారిన పడి మృతి చెందాడు. వారి కుటుంబానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ అండగా నిలిచారు. మృతుడి పిల్లల చదువు కోసం తన సొంత నిధుల నుంచి రూ.50వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు తెలుగు యువత అధికార ప్రతినిధి వల్లేరు అమర్‌నాథ నాయుడు పాల్గొన్నారు.

పనులను సకాలంలో పూర్తి చేయించాలి

● జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు


ఎంపీడీవోకు సూచనలిస్తున్న రవికుమార్ నాయుడు

వెదురుకుప్పం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జడ్పీ, పీఎంఏజీపై నిధులతో జరుగుతున్న పనులను సకాలంలో పూర్తి చేయించాలని కార్వేటినగరం ఎంపీడీవో విద్యావతిని జడ్పీ సీఈవో వి.రవికుమార్‌నాయుడు ఆదేశించారు. గురువారం కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఇంటింటి చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ, ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకుల క్లీనింగ్‌పై సమీక్షించారు. పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. అనంతరం కార్వేటినగరం ఐటీఐ వద్ద పరిశీలించి.. సిమెంటు రోడ్డు నిర్మిస్తామని చెప్పారు. ● వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయాన్ని కూడా గురువారం జడ్పీ సీఈవో తనిఖీ చేసి, సిబ్బందికి సూచనలిచ్చారు. ఆయనవెంట ఎంపీడీవో పురుషోత్తం ఉన్నారు.

వరసిద్ధుడి సేవలో కేరళ హైకోర్టు న్యాయమూర్తి

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణనటరాజ్ కుటుంబ సమేతంగా కాణిపాక వరసిద్ధుడిని గురువారం దర్శించుకున్నారు. వీరిని సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


బాధితులకు చెక్కు అందిస్తున్న ఎస్పీ తుషార్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉంటూ ప్రమాదాలకు గురైన రెండు కుటుంబాలకు రూ.లక్ష చెక్కును ఎస్పీ తుషార్ పంపిణీ చేశారు. తాలూకా పోలీసుస్టేషన్‌లో పనిచేస్తూ ప్రమాదానికి గురైన ఏఎస్ఐ మురుగేశన్‌కు రూ.50వేల చెక్కును, ఇంటికి వెళుతున్న సమయంలో ప్రమాదానికి గురైన ఏఆర్ పీసీ రవితేజనాయక్ సతీమణి రెడ్డెమ్మకు మరో రూ.50వేల చెక్కును ఎస్పీ అందజేశారు. గురువారం పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీ సాయినాథ్, పోలీసు సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం



పూతలపట్టు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పాలకూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం మధ్యాహ్నం టీడీపీ రాష్ట్ర నేత యువరాజుల నాయుడు, యూత్ సభ్యుడు కిచ్చెన్నగారిపల్లెకు చెందిన టీడీపీ నేత మేదరమిట్ట కిశోర్‌లు అన్నదానం చేశారు. రాజశేఖర్‌నాయుడు, భాను, తారక్, ఉమాశంకర్, హెచ్‌ఎం మనోహర్, టీచర్లు మునిలక్ష్మి, సుజాత, విజయకుమారి, చిరంజీవి పాల్గొన్నారు.

201 మంది విద్యార్థుల ఆధార్ అప్‌డేట్

గంగాధరనెల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కోటాగరం పంచాయతీ ఎట్టేరి శ్రీభానోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో, భానోదయ సీబీఎస్ఈ స్కూల్లో 201 మంది విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ చేశారని కరస్పాండెంట్ మద్దిపట్ల నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో డిజిటల్ అసిస్టెంట్లు సుమిత్రాదేవి, సిసింద్రీ, మహిళా పోలీసులు రత్న, విమల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

దాడి ఘటనపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై దాడిచేసిన ఘటనపై కేసు నమోదైంది. రెండో పట్టణ సీఐ నెట్టికంటయ్య తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 21వ తేదీ ఓటిచెరువుకు చెందిన మధు ఇంటి ముందు వెంకటేశ్, తరుణ్, మనోజ్‌కుమార్, గోవింద్‌లు టపాసులను కాల్చారు. ఈ సందర్భంగా వాటిని మధుపైపుగా విసరడంతో ఆయన ఇదేం పనని ప్రశ్నించాడు. దాంతో తొలుత నలుగురు దాడి చేశారు. మళ్లీ అదే రోజు రాత్రి ఎనిమిది గంటలకు తమ స్నేహితులైన ఉదయ్, పవన్, భరత్‌లతో కలిసి రాళ్లు, కర్రలతో వచ్చి మధుపై దాడి చేసి, గాయపరిచారు. బాధితుడు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చాడు. గురువారం బాధితుడి ఫిర్యాదుతో ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రమాదాలకు నిలయంగా గుంతలు


లిటిల్ ఫ్లవర్ స్కూల్ వద్ద కన్నన్ రోడ్డుపై గుంతలు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏర్పడిన గుంతలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. మూడు నెలల కిందట నీటి పైప్‌లైన్ కోసం కన్నన్ రోడ్డులోని లిటిల్ ఫ్లవర్ సమీపంలో సువేరా హౌస్ క్రాస్ రోడ్డులో పలు చోట్ల గుంతలు తవ్విన మున్సిపల్ సిబ్బంది వాటిని సరిగ్గా పూడ్చకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేలూరు నుంచి చిత్తూరు వచ్చే బస్సులతోపాటు ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలకు ఇదే ప్రధాన మార్గం. ఇక్కడే పాఠశాలలు, హాస్టళ్లు, బ్యాంకులు, వ్యాపార దుకాణాలున్నాయి. దీంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడి గుంతలు ఏకంగా అడుగుపాటి లోతుగా ఏర్పడటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్సులు, ద్విచక్రవాహనాలు ఒకేసారి ఈ ప్రాంతానికి చేరుకుంటే ప్రమాదాలు జరిగే అవకాశాలు లేక పోలేదు. పలువురు వాహనాలు నడుపుతూ గుంతలు తెలియక పడిపోతున్నారు. పెద్ద ప్రమాదం జరగక ముందే మున్సిపల్ అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వరికి తీవ్ర నష్టం

ఓవైపు భారీ వర్షాలు, మరోవైపు అడవి పందులు తొక్కేయడమే కారణం


పెరుమాళ్లపల్లె వద్ద అడవి పందులు తొక్కేసిన వరిపంట - నీట మునిగిన వరిని చూపుతున్న రాజారెడ్డి

యాదమరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓవైపు భారీ వర్షాలు.. మరోవైపు అడవి పందులు తొక్కేయడంతో పెరుమాళ్లపల్లెలో వరిపంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ మేరకు రైతు రాజారెడ్డి గురువారం వ్యవసాయశాఖ సిబ్బందికి తెలిపారు. అలాగే స్థానిక ఐవోసీఎల్ సంస్థ ట్యాంకు నుంచి విడుదలవుతున్న వృథాజలాల కారణంగా కూడా పంట దెబ్బతిందని ఆయన ఫిర్యాదు చేశాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు. దీంతో వ్యవసాయ శాఖ సిబ్బంది వచ్చి దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ


మణెమ్మకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

విజయపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): క్షూరికాపురానికి చెందిన టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్‌రాజు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబానికి సీఎం సహాయనిధి కింద రూ.6,41,365 చెక్కు మంజూరైంది. ఈ చెక్కును విష్ణువర్ధన్‌రాజు సతీమణి మణెమ్మకు గురువారం ఎమ్మెల్యే భానుప్రకాష్ అందజేశారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయ యాదవ్, మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు గజేంద్రనాయుడు, సుధాకర్‌నాయుడు, నారాయణరాజు, బాలాజి, గాలి మురళి, సమరసింహారెడ్డి, మునిభాస్కర్‌రాజు, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం: టీడీపీ


బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు

గుడిపాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పేదలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. గురువారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆదేశాలతో మండికృష్ణాపురం పంచాయతీ పెరుమాళ్లకుప్పంలో అలివేలుకు చెందిన పెంకుటిల్లు కూలి పోవడంతో వృద్ధురాలికి నిత్యావసర వస్తువులను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు ధనసింగ్, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్య యాదవ్, నాయకులు రవినాయుడు, రవి, బాబు, గోపి, గవాస్కర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నరహరిపేటలో కాంగ్రెస్ సమావేశం

గుడిపాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నరహరిపేటలో కాంగ్రెస్ సమావేశాన్ని మండల పార్టీ అధ్యక్షుడు సెల్వం అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చూపించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో చేరారు. జిల్లా ఉపాధ్యక్షుడు లోకేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి హోమేష్, జీడీ నెల్లూరు కోఆర్డినేటర్ రమేష్‌బాబు, చిత్తూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ విక్కిరాయల్ తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన

యాదమరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పౌరహక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వీరేంద్ర సూచించారు. ఓటివారిపల్లె పంచాయతీ కె.కొత్తూరులో గురువారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంఈవో రుక్మిణి, ఏపీవో సంధ్యారాణి, ఏవో దీప, ఏపీఎం ఈశ్వరి, సర్పంచ్ పత్తిపాటి భగవతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నగరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): 76వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన,వక్తృత్వ, క్విజ్ పోటీలను గురువారం ఎమ్మార్సీ వద్ద నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో.. పద్మప్రియ, లింగావన్, ప్రీతి, ఉపన్యాస పోటీల్లో.. దిలీప్, ప్రీతి, ఆజీర, క్విజ్ పోటీల్లో.. తులసి, శ్రీనివాస, దిలీప్ విజేతలుగా నిలిచారు. మండలంలోని ఉపాధ్యాయులు శ్రీనివాసులు, మురళీకృష్ణ, పురుషోత్తం, నాదముని, తులసిరామన్, సీఆర్పీ అయ్యప్ప పాల్గొన్నారు.

గోకులం షెడ్లను పది రోజుల్లో నిర్మించాలి: డ్వామా పీడీ


నల్లవెంగనపల్లెలో పనులను పరిశీలిస్తున్న రవికుమార్

వెదురుకుప్పం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్ల నిర్మాణ పనులను పదిరోజుల్లో పూర్తి చేయించాలని డ్వామా పీడీ రవికుమార్ ఏపీవో మీనాకుమారి, ఉద్యోగులను ఆదేశించారు. గురువారం నల్లవెంగనపల్లె, జక్కిదొన గ్రామ పంచాయతీల్లో నిర్మిస్తున్న గోకులం షెడ్ల పనులను పరిశీలించారు. అనంతరం ఉద్యోగులకు సూచనలు, సలహాలను ఇచ్చారు.

జిల్లా స్థాయి చెస్ పోటీలకు ముడిపల్లె విద్యార్థులు



నగరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో జరగనున్న చెస్ పోటీలకు ముడిపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం మురళీకృష్ణ తెలిపారు. అండర్-14 బాలుర విభాగంలో.. లీలాప్రసాద్, జగన్, అండర్-14 బాలికల విభాగంలో.. చక్రియ, పూజిత, దీప, అండర్-17 విభాగంలో రూప, కేశవన్, నవ్యశ్రీ, లోహిత్, ఆశ ఎంపికయ్యారని చెప్పారు.

ఆధునిక పరికరాల వాడకంతో అధిక దిగుబడి


డ్రోన్‌ని ప్రారంభిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

నగరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ఆధునిక పరికరాల వాడకం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని నగరి వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్ తెలిపారు. గురువారం 80 శాతం సబ్సిడీతో ప్రభుత్వం పంపిణీ చేసిన డ్రోన్‌తో క్రిమి సంహారక మందు పిచికారినీ ప్రారంభించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు కె.బాలాజి, టీడీపీ మండల అధ్యక్షుడు జాఫర్‌రెడ్డి, రైతులు దినేష్‌రెడ్డి, శరత్ బాబు, రాము పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యలో విష సర్పాలు


ఇళ్ల మధ్యలో కప్పను వేటాడుతున్న పాము →

ఐరాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురిసి వెలిసిన వెంటనే ఇళ్ల మధ్యలో విష సర్పాలు దర్శనమిస్తున్నారు. నాగమువాండ్లపల్లె పంచాయతీ వీఎస్ అగ్రహారం లోని న్యూకాలనీలో గురువారం ఓ ఇంటి వద్ద భారీ విష సర్పం కనిపించింది. ఈ ప్రాంతంలో కాలువలు లేక వర్షపు నీరు, మురుగు నిల్వ ఉండటంతో కప్పలు విపరీతంగా ఉన్నాయి. వీటిని వేటాడటానికి పాములు ఇళ్ల మధ్యకు వస్తున్నాయి. దీంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా వర్షపు నీరు, మురుగు నిల్వ ఉండకుండా పంచాయతీ అధికారులను తగిన చర్యలు చేపట్టాలని న్యూకాలనీ వాసులు కోరుతున్నారు.

ప్రమాదపు అంచుల్లో బంగారక్క చెరువు

● ఆందోళన చెందుతున్న రైతులు

గుడిపాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలంలో ఉన్న అతి పెద్ద చెరువులలో ఒకటైన బంగారక్క చెరువు హైవే అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదపుటంచులకు చేరుకుంది. చెరువు మధ్య భాగంలో పది పిల్లర్లకుపైగా నిర్మించారు. చివర్లో ఉన్న పిల్లర్ వద్ద హైవే కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేయడంతో చెరువు నుంచి నీరు లీకవుతోంది. లీకేజీ అధికమైతే చెరువుకట్ట తెగుతుందని దీని కింద ఉన్న 152 ఎకరాల ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే సుమారు 10 గ్రామాలకు కూడా ఇబ్బంది ఏర్పడుతుంది. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి చెరువు కట్టకు మరమ్మతులు చేయాలని ఆయకట్టు రైతులు, ప్రజలు కోరుతున్నారు.


నిండిన బంగారక్క చెరువు - చెరువు నుంచి లీకవుతున్న నీరు

గ్రామంలోనే రేషన్ సరుకులు పంపిణీ చేయండి

● కత్తిరెడ్డిపల్లెవాసుల వినతి


చెరువు మొరవలో నిలబడి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పెనుమూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోనే రేషన్ సరుకులను పంపిణీ చేయించాలని కత్తిరెడ్డిపల్లె గ్రామస్తులు విన్నవించారు. వర్షాల కారణంగా గాగమ్మగారిపల్లె చెరువు మొరవ పారుతోందని చెప్పారు. కట్టపై వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ పరిస్థితుల్లో నాలుగు కిలోమీటర్ల దూరంలోని గాగమ్మగారిపల్లెలో ఉన్న రేషన్‌షాపు వద్దకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. ఈ మేరకు చెరువు మొరవ నీటిలో నిలబడి గురువారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అమరావతి, నాయకులు, స్థానికులు సుధాకర్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, మోహన్‌నాయుడు, రాజారెడ్డి, కృష్ణమనాయుడు, ఏకాంబరం, లోకేష్, జగన్నాథరెడ్డి, నారాయణరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆలయంలో హుండీ చోరీ

శ్రీరంగరాజపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురం సమీపంలోని ఆత్మలింగేశ్వరస్వామి ఆలయంలో ఉన్న హుండీని చోరీ చేశారు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో ఉన్న హుండీని ఎత్తుకెళ్లినట్లు ధర్మకర్త మోహన్ నాయుడు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. కాగా, ఆలయానికి వెళ్లే దారిలో బ్రాందీషాపు ఉండటంతో ఈ మార్గంలో మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయని ధర్మకర్త తెలిపారు. మహిళలు గుడికి రావాలంటేనే భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపైనా పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

వైసీపీలోనే ఉంటాం: ఎంపీపీ

వెదురుకుప్పం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): 'అసత్య ప్రచారాలను నమ్మొద్దు. మేము వైసీపీని వీడిపోయే ప్రసక్తే లేదు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, జీడీ నెల్లూరు వైసీపీ సమన్వయకర్త కృపాలక్ష్మి వెంటే ఉంటాం' అని కార్వేటినగరం ఎంపీపీ లత, ఆమె భర్త వైసీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బాలాజీనాయుడు స్పష్టం చేశారు. గురువారం కార్వేటినగరంలో వారు మీడియాతో మాట్లాడారు. పాలసముద్రం ఎంపీపీ శ్యామల శివప్రకాష్‌రాజు ఇంట్లో విందుకు వెళితే దానికి రాజకీయ రంగు పులిమారన్నారు. సమావేశంలో పురంధర్, లోకనాథనాయుడు, మురగయ్య పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ కాక అందని 'మామిడి' సబ్సిడీ

విజయపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడి కాయలకు ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ నగదు మండలంలో కొందరు రైతులకు అందలేదు. ఆధార్ అప్‌డేట్ కాకపోవడమే కారణంగా తెలుస్తోంది. దీనికి సంబంధించిన వివరాల కోసం సంబంధిత రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వారేమో తమ వద్ద జాబితాలు లేవని చెబుతున్నారు. దీనిపైఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జాయింట్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

● లేదంటే రాష్ట్రవ్యాప్త ఆందోళన
● నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం

చిత్తూరు రూరల్ అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు అటెండర్లపై అమానవీయంగా ప్రవర్తించిన జాయింట్ కమిషనర్‌పై తగిన చర్యలు తీసుకోకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళన చేస్తామని నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. వివరాలు తెలుసుకున్న మంత్రి పయ్యావుల కేశవ్ తక్షణమే స్పందించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా.. బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

హాస్టల్ పరిసరాల్లో చెత్త తొలగింపు



గంగాధర నెల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు బాలికల హాస్టల్ పరిసరాల్లో చెత్తాచెదారాన్ని గురువారం తొలగించారు. కలెక్టర్ ఆదేశాలతో గురువారం సాయంత్రం గ్రీన్ అంబాసిడర్ల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్‌డబ్ల్యువో నాగేశ్వరరావు, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో శివయ్య, వార్డెన్ సులోచన, బాలగంగనపల్లె పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ పనులను పర్యవేక్షించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

నగరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మాంగాడు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారి హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి హరిత చర్యలు తీసుకున్నారు. గేట్‌వాల్ మరమ్మతులు చేయడంతో తాగునీటి సమస్య తాత్కాలికంగా పరిష్కరించామని తెలిపారు. శాశ్వత పరిష్కారం కింద ఆ వీధికి పైపులు వేయడానికి సన్నాహాలు చేయిస్తామన్నారు. టీడీపీ నాయకుడు శివకుమార్‌రెడ్డి, నారాయణ, గోపాల్‌శెట్టి, గ్రామస్తులు పాల్గొన్నారు.